'మీరూ-మీ సెక్స్‌లైఫ్' వ్యాసం చదవటం పూర్తయ్యేసరికి రుక్మిణికి అనిపించింది-తమ వైవాహిక జీవితం ఉండవలసినంత ఆనందంగా ఉండటం లేదని.

వాళ్ల పెళ్లయి పాతికేళ్లయింది. సిల్వర్ జూబిలీ మేరేజీ ఏనివర్సరీ వచ్చే



నెలే! ఇద్దరు పిల్లలకీ పెళ్లిళ్లయి దూరంగా ఉద్యోగాల్లో ఉంటున్నారు. భర్త బిజినెస్ పనుల్లో కొట్టుమిట్టాడుతూనే ఉన్నాడు.

ఇలాంటి సందర్భాల్లోనే శృంగారజీవితం పూర్తిగా దెబ్బతినిపోతుందని రుక్మిణి చేతిలో వున్న వారపత్రిక ఘోషిస్తోంది. ఆ వ్యాసం చివర్లో ఓ క్వొశ్చనీర్ కూడా వుంది.

నెలకి ఎన్ని సార్లు కలుస్తున్నారు? ఎంత సేపు? .. గట్రా...గట్రా...

ఆ వ్యాసం రేటింగ్ ప్రకారం 'తమ' సెక్స్ లైఫ్ 'బిలో ఏవరేజ్!' అని తెలిసివచ్చింది రుక్మిణికి. నివారణోపాయాలు వచ్చే సంచికలో ప్రచురిస్తారట!

వచ్చే సంచిక వెలువడేదాకా రుక్మిణి ఆగలేక పోయింది. భర్తతో చర్చించటం దండగని ఆమె కెలాగూ తెలుసు. అతనికి బిజినెస్ పనులే ముఖ్యం. నిజానికి అతనికి తనంటే చచ్చేటంత యిష్టమన్న మాట నిజం! కాని ఆ ఇష్టాన్ని, ఆ ప్రేమని, రకరకాల పనులద్వారా, చేష్టలద్వారా వ్యక్తీకరించి జీవితంలో కొత్తరంగులు, కొత్తరుచులు నింపాలి గదా? ఆయన కంత టైమేదీ?

ఆ మాటకొస్తే-తనలో మాత్రం మార్పు రాలేదా? పెళ్లయిన కొత్తల్లో పులకరించినట్టు తనిప్పుడు పులకరిస్తోందా?శరీరం వింటినారిలా బిగుస్తోందా? గుండెల్లో లావా పొంగి, నిట్టూర్పుల ద్వారా బయటికి వస్తోందా?

ఆయన పరిస్థితీ అంతే!

ఒకళ్లకొకళ్లు పాతబడిపోయారనిపించింది రుక్మిణికి.

ఒకళ్ల శరీరాలు మరొకళ్లకి చిరపరిచితం.

ఎక్కడ ఏమిటి ఏ మలుపు తిరిగిందో, ఎక్కడ ఏ పుట్టుమచ్చ వుందో, ఎక్కడ ఏది శ్రుతిచేస్తే ఏ స్పందన కలుగుతుందో ఇద్దరికీ ఏడో ఎక్కం అంత క్షుణ్ణంగా తెలుసు. అందుకేనేమో ఇద్దరిలోనూ హుషారు పోయింది.

ఇప్పుడివన్నీ అనుకుని ఏం లాభం?

ఇప్పటికైనా మేలుకోవాలి. ఏనివర్సరీ నాటికి చక్కని ఏర్పాట్లు చేసుకుని. కొత్తదంపతుల్లా, ఒకళ్లకొకళ్లు 'ఎక్స్‌ప్లోర్' చేసుకుంటూ శృంగారాన్ని అనుభవించాలి.

కొత్తదనం కోసం జీవితభాగస్వామిని మార్చలేం కదా!

పాతబడిన జీవాల్నే కొత్తగా మలుచుకోవాలి.

✸ ✸ ✸

**రు**క్మిణి మాటకు రావు అడ్డు చెప్పలేదు.

"సిల్వర్ జూబిలీ మేరేజీ ఏనివర్సరీకి కాస్త ఖర్చు అవుతుందండోయ్!" అని రుక్మిణి అనగానే. "నీ ఇష్టం! నీ ఎకవుంట్లో డబ్బుందిగా!" అన్నాడు.

ఆ వేళ్టినుంచి రుక్మిణి తిరగని ఫర్నిచర్ షాపు లేదు, కన్సల్ట్ చేయని ఇంటీరియర్ డెకొరేటర్ లేడు. రెండు వారాలు తిరక్కుండా బెడ్ రూమ్‌లో నాలుగు గోడల నిండా 'వాల్-టు-వాల్' అద్దాలు వెలిశాయి. ప్లాస్టరాఫ్ పారిస్‌తో ఖజూరహో శిల్పాలు నిలబడ్డాయి.

"మొఘలేఆజం-సెట్టింగ్ వేయిస్తున్నావా?" అన్నాడు రావు అద్దాన్ని చూసి.

"ప్యార్ కర్నా హై తో డర్నా క్యా?" అంది రుక్మిణి ప్రబంధనాయిక పోజు పెట్టి.

"ఒక్క రుక్మిణితోనే తాళలేకుండా పోతున్నాను. ఇంత మంది రుక్మిణులా?" అన్నాడు రావు చుట్టూ ఉన్న అద్దాల్ని చూస్తూ.

"భయమేల నాథా, అంతమంది రావులూ ఉంటారుగా! తాళలేకపోవటానికేం; హుషారు తెప్పించే చిట్కాలు మా వద్ద కొల్లలుగా ఉంటాయిగా!" అంది రుక్మిణి అతని బుగ్గమీద చిటికేసి.

✸ ✸ ✸

**ఆ** చిట్కాలన్నీ ఏనివర్సరీ నాటికి పూర్తయ్యాయి. కదిలేమంచం, ఏరికోరి తెచ్చిన హుషారైన సి.డి.లు, అగరొత్తుల ధూపం, శాటిన్ దుప్పట్లు, స్ప్రేలు, పిక్-మీ-అప్ కాక్‌టైలూ, తగుపాళ్లలో భోజనం, తాంబూలం...

"అంతా బాగానే వుంది. ఇంత బిల్డప్ ఇచ్చి నువ్వు మాత్రం చీరా, జాకెట్టూ వేసుక్కూచున్నావేమి టి?" అన్నాడు రావు ఆమెను దగ్గరకు లాక్కోబోతూ.

"అందులోనే వుంది మజా. మిమ్మల్ని మాత్రం సిల్కు పైజామా, లాల్చీ ఎందుకు వేసుకోమన్నానూ? ఓ చిన్నతమాషా. ఎప్పటిలా మీద పడి పరపరా బట్టలన్నీ లాగేసుకోవడం కుదరదివాళ. 'టాస్' వేద్దాం. ఎవరోడిపోతే వాళ్లు రెండో వాళ్ల బట్టల్ని ఒక్కొక్కటీ ఒలిచేయొచ్చు. మాగజైన్ వాడు రాశాడు. బావుందా?"

"ఏడిసినట్టుంది. ఆ రాసేవాళ్లు ఇవన్నీ చేస్తారా ఏమన్నానా? అందుకేనా నెల్లాళ్లనుంచీ ఉపవాసం చేయించావ్?" అన్నాడు రావు చిరాగ్గా.

"చూశారా? అంతకు ముందు అనేకసార్లు నెలకు పైబడే కలవకుండా ఉన్నాం. అప్పుడేమీ 'మిస్' కాలేదు మీరు. ముందుగానే చెప్పడం వల్ల మీకు ఆరాటం పెరిగింది. అదే ఆ మాగజైన్ వాడు రాసింది. మీరు ఏమనుకున్నా సరే ఈ 'స్ట్రిప్ టీజ్' తప్పదు! దీనివల్లనే మనలో ఎగ్జయిట్‌మెంట్ పెరుగుతుంది."

"సరే, కానీ" అన్నాడు రావు నవ్వు మొహానికి పులుముకుని.

వెంటనే రుక్మిణి, రావు బొమ్మా, బొరుసూ చెప్పుకుని కాయిన్ ఎగరేశారు. అదెక్కడా కనబడ్లేదు.

"అసలే డిమ్ లైట్-ఏం కనబడుతుంది? సర్లే నువ్వే గెలిచావ్! పైజామా ..." అన్నాడు రావు.

'నో, నో, ముందు లాల్చీనే. అయినా కాయిన్ వెదుకుదాం, మీ దయాదాక్షిణ్యాలు నాకెందుకు?' అంది రుక్మిణి.

ఇద్దరూ మంచం మీదా, కిందా దూరి, దుప్పట్లు లాగిపారేసి వెదికారు. పావుగంటయినా కాయిన్ కనబడకపోయేసరికి రావుకి చిరాకు పుట్టింది.

"ఈ సీక్వెన్స్‌కి-ఈ వెధవ మ్యూజిక్కొకటీ!" అంటూ టేప్ ఆఫ్ చేశాడు రావు.

పరిస్థితి విషమించవచ్చని గ్రహించి రుక్మిణి ఇంకో కాయిన్‌తో టాస్ వేద్దామంది.

ఈ సారి రుక్మిణి ఓడిపోయింది. చివరి ముడి విప్పాలి.

"ట్యూబ్‌లైట్ వేయనా?" అన్నాడు రావు.

"ఉండండి! లైట్ వేస్తే రొమాంటిక్ మూడ్ పోతుంది" అని ముడిని మళ్లీ విప్పబోయింది. అది పీటముడి పడిపోయింది. రాలేదు.

"రూల్స్ రిలాక్స్ చెయ్యి, నేను విప్పేస్తా" అన్నాడు అసహనంగా రావు.

"ఆగండీ-అన్నింటికీ తొందరే, ఓ సరదా పాడూ లేదు-ఎంత సేపూ ఒకటే ఆత్రం!" అంటూ విసుక్కొంది రుక్మిణి లంగా బొందుమీద కోపాన్ని భర్త మీదకు మళ్లించి. నాలుగయిదు నిమిషాలు... రుక్మిణికి కళ్ల నీళ్లొచ్చాయి.

"సరే, వచ్చి ముడి విప్పండి" అంది రుక్మిణి ఓటమినంగీకరిస్తూ.

రావులో ఒక్కసారి హుషారు వచ్చింది. పరుగున వచ్చి ఆమెని కౌగలించుకున్నాడు.

'మూడో?' అనబోయింది రుక్మిణి.

"ముడి కాదు, మూడ్ విప్పాగా...!" చెవిలో గొణిగాడు రావు.

రూఫ్ మధ్యలో ప్రతిఫలించిన రావును చూసి రుక్మిణి మొహాన నవ్వు మొలిచింది. కొంటెగా అతని చెవి కొరికింది.